# ఉడ్ రోజ్

సాయంకాలం పూట బాల్కనీలో కూర్చుని వీధిలో వచ్చే పోయే వాళ్లని చూడటం అలవాటైంది నాకు. పనేముంది నాకు! అంతా కోడలే చూసుకుంటుంది. ఏదన్నా చేద్దామని వంటింట్లోకి వెళ్లబోతే, "మీరేం చేస్తారు, వెళ్ళి రెస్టు తీసుకోండి" అంటుంది.

విశ్రాంతి కావాలనుకున్నప్పుడు ఒక్క క్షణం తీరిక లేకుండా చాకిరీతో సతమతమయ్యేదాన్ని. ఇప్పుడిక విశ్రాంతి- విశ్రాంతి విశ్రాంతి అంటే విసుగు పుడుతోంది. వృద్ధాప్యం ఇంత విసుగనిపిస్తుందనుకోలేదు.

వాలుకుర్చీలో పడుకుని కునుకు తియ్యడం, మనవలందరితో ఆడుకోవడం, కథలూ, కబుర్లూ చెప్పడం, ఇరుగు పొరుగు వాళ్లతో, వచ్చే పోయే బంధువులతో ముచ్చట్లాడటం, ఇంట్లో వాళ్లని సాధిస్తూ కర్ర పెత్తనం చేస్తూండటం— వృద్ధాప్యం ఎంతో హాయి అనుకునే దాన్ని చిన్నప్పుడు. ఇప్పుడు నాదాకా వచ్చాక తెలుస్తోంది. పల్లెటూళ్లలో వృద్ధాప్యం గడపటానికీ, పట్నాల్లో వృద్ధాప్యం గడపటానికీ బోలెడు తేడా వుందని కూడా తెలుస్తోంది.

ఈ మహానగరంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అంటీముట్టనట్లు వుంటారు ఇరుగు పొరుగువాళ్లు. వాళ్లు చనువుగా మనింటికి రారు, మనం వెడితే ముళ్ళ మీద కూర్చున్నట్లు కూర్చుని వద్దుమొర్రో అంటున్నా గుక్కెడు కాఫీపోసి పంపిస్తారు. అందుకే ఇలా బాల్కనీ లో కూర్చుని వీధిలో వచ్చే పోయే వాళ్లని చూడటమే పని. చూస్తూ కూర్చుంటే ఏవో ఆలోచనలు పాతవీ, కొత్తవీ వచ్చి పోతూంటాయి. అదే కాలక్షేపం.

బాల్కనీ పక్కని గోడ వారగా కోడలు ఏదో విత్తనం నాటుతోంది.

"ఏమిటే కమల అది?" అన్నాను.

"ఓ పూల తీగ విత్తనం నాటుతున్నానండీ" అంది.

"ఏం పువ్వులు? శంఖంపూలతీగా?" అని అడిగాను.

"కాదండీ. దీన్ని ఉడ్ రోజ్ అంటారండి" అంది తలవంచుకుని మన్ను కెలుకుతూ.

నేనెప్పుడూ ఆ పేరు వినలేదు. వీళ్లు చామంతి పువ్వుల్ని కూడా ఇంగ్లీషు పేర్లతో పిలుస్తారు. అలాగే నాకు తెలిసిన పూల పేరే నేమో తెలుసు కుందామని, "ఆ పువ్వులు చూడ్డానికెట్లా వుంటాయమ్మా?" అన్నాను.

"పసుపు పచ్చని బాకా పువ్వులు పూస్తాయి ముందు. తరవాత వాటి తొడిమల్లోంచే గంధం చెక్క రంగులో గులాబీ పువ్వుల్లాంటివి పూస్తాయండీ" అంది.

"సువాసనేమైనా వుంటుందా? లేకపోతే పూజకి పనికొచ్చేనా?" అని అడిగాను కుతూహలం ఆపుకోలేక.

"సువాసన వుండదు కానీ, చాలా అందంగా వుంటాయి ఆ పువ్వులు. వాజ్‌లో పెట్టుకుంటే ఎన్నాళ్లయినా నిలవుంటాయి" అంది.

ఏమో, ఏమిటో, నేనెప్పుడూ అలాంటి పువ్వుల్ని చూళ్లేదు! శుభ్రంగా ఏ సన్న జాజి తీగో వేసుకుంటే ఘుమ ఘుమ లాడుతూ బోలెడు పువ్వులు పూస్తాయి. తల్లో పెట్టుకో వచ్చు పిల్లలు. ఇంటి కొచ్చిన ముత్తయిదువల కిచ్చుకుంటే ముచ్చటగా వుంటుంది. అంతే గాని, కనీవిని ఎరుగని ఇలాంటి తీగలు తెచ్చి వేసుకోవడం ఎందుకో! పోనీ ఏ బూడిద గుమ్మడి కాయ తీగో వేసి డాబా మీద కెక్కిస్తే బోలెడు కాయలు కాస్తాయి. రెండు చేతులా నలుగురికీ పంచి పెట్టుకో వచ్చు. అలా అనుకునే, ఆ మధ్య గోడవారగా విత్తనాలు నాటాను. చక్కగా మొలిచాయి. ఆ మర్నాడు చూస్తే మొక్కలు కనిపించలేదు. "ఇక్కడ మొక్కలు ఏమయినాయ్రా?" అని అబ్బాయినీ, కోడల్నీ— ఇద్దర్నీ అడిగాను. మాకు తెలియదన్నారు. ఏ గడ్డి మొక్కలో అనుకుని వాళ్లే పీకి పారేసి వుంటారు. నామాటంటే గడ్డి పరకంత విలువ లేకుండా పోతోందీమధ్య.

'నాలుగు వంగ మొక్కలూ, బెండ మొక్కలూ పెంచండ్రా' అంటే, ఆ జాగాలో ముదనష్టపు బ్రహ్మజెముడు మొక్కలూ, క్రోటను మొక్కలూ వేశారు. ఇద్దరి కిద్దరే. ఒకరి కొకరు తందాన తాన అనడం— అదైనా నేనెప్పుడైనా సలహా ఇచ్చినప్పుడే. ఉత్తప్పుడు అయిందానికీ కానిదానికీ కీచులాడుకుంటూనే వుంటారు!

సరే, నాకెందు కొచ్చిందని ఊరుకున్నా. ఓ పది రోజులకి ఆ విత్తనం మొలకెత్తింది. మా కోడలు సంబరం ఇంతా అంతా కాదు. దాన్ని రోజూ ఎంతో అపురూపంగా చూసుకుంటూ, కొంచెం ఎదగ్గానే దాన్ని గోడకి అంటి వున్న పైపుకి కట్టి, ఆ పైపుని పట్టు



అబ్బూరి ఛాయాదేవి

కుని డాబా మీదకి అల్లుకునేలా ఏర్పాటు చేసింది. మూడు నెలలు తిరిగే సరికి బాల్కనీ గోడ చుట్టూ అల్లుకుంది. బాల్కనీ చుట్టూ వున్న 'గ్రిల్లు' నిండా అల్లుకుంటోంది. నేను బాల్కనీలో కూర్చుని వీధిలోకి చూడాలంటే ఇబ్బంది అవుతుందేమో, వున్న కాస్త కాలక్షేపం పోతుందేమో నని గిజగిజ లాడింది నా మనస్సు. ఊరుకోలేక కోడలితో ఓసారి అని చూశాను. ఏమనుకుందో, ఆ తీగని కాస్త బిగించి పైకి లాగి, డాబా మీదకే ఎక్కువగా అల్లు కునేలా తాళ్లూ, వైరులూ వేసి కట్టింది.

మేడమీద ఒక్కటే గది వుంది. తక్కిన దంతా డాబాయే. ఆఫీసు నుంచి వచ్చాక అబ్బాయి అక్కడే కూర్చుని చదువుకుంటూ వుంటాడు. ఆదివారాలు కూడా స్నేహితులతో అక్కడే గడుపుతూ వుంటాడు. వాడో రోజున పెళ్ళాన్ని పిలిచి కేక లేశాడు. నాకు సరిగ్గా వినిపించ లేదు ఆ కేకలాట. నేను కలగ జేసుకోలేదు బాగుండదని.

ఆ తరవాత ఓ నాడు మా కోడలు ఇల్లంతా శుభ్రంగా సర్ది, ముందు గదిలో బల్ల మీద గాజు కూజాలో పువ్వుల కొమ్మలు గుచ్చుతోంది. పసుపు, ఎరుపు గులాబీల తో బాటు గంధపుచెక్క రంగులో వున్న గులాబీ పూల కొమ్మల్ని కూడా గుచ్చింది. చూడటానికి తమాషాగా అనిపించి, ఇవేం పువ్వులా అని పట్టుకు చూశాను. ఎండి పోయి పెళపెళలాడుతున్నట్టు న్నాయి.

" ఇవేం పువ్వులు, ఇలా వున్నాయి? ఆ తాజా గులాబీలతో పాటు వీటి నెందుకు పెట్టావమ్మా?'' అన్నాను.

"వీటినే ఉడ్‌రోజ్ అంటారండీ. ఇలా అమర్చడం "వృద్ధాప్యం, యౌవనం'' కలిపి చూపించడానికి. ఉడ్ రోజ్ పువ్వులు వృద్ధాప్యానికీ, తాజా గులాబీలు యౌవనానికీ ప్రతీకలన్నమాట. ఇటువంటి అలంకరణని "ఇకెబానా'' అంటారు."

"అత్తా కోడళ్లని పిలవరాదా!'' అన్నా నవ్వుతూ. మా కోడలు కూడా నవ్వేసింది.

అప్పటి నుంచీ ఆ ఉడ్ రోజ్ పువ్వులు ఎప్పుడు పూస్తాయా అని బాల్కనీలో కూర్చుని ఆ తీగ కేసి చూస్తూ వుండేదాన్ని. వీధిలో వచ్చే పోయే మనుషుల్ని చూడ్డానికి ఆ తీగతో ఏదో అనుబంధం ఏర్పడినట్లు అనిపించింది.

తీగనిండా పసుపు పచ్చని బాకా పువ్వులు కళకళ్లాడుతూ కనిపిస్తున్నాయి. ఇంక ఉడ్ రోజ్ పువ్వులు ఎప్పుడు పూయడం మొదలవు తాయా అని ఎదురు చూస్తున్నాను.

ఆ రోజు ఆదివారం. భోజనాల కింకా వేళ కాలేదు. పూజ ముగించుకుని, ఏం తోచక బాల్కనీలోకి వెళ్లాను అక్కడ కూర్చుందామని.

"అదేమిట్రా, ఆ పూల తీగని అలా పీకేస్తున్నావ్?'' అని అరిచాను.

అబ్బాయి గోపాలం నామాట వినిపించుకో లేదు. వరండా చుట్టూ అల్లుకుని డాబా గోడదాకా దట్టంగా అల్లుకున్న ఉడ్‌రోజ్ పూల తీగని అలా చీల్చి చెండాడు తూంటే నా మనస్సు గిలగిల్లాడింది. వాడు నా మాట వినిపించుకోవడంలేదని, వంటింటి వేపుకి వెళ్ళి కోడల్ని పిలిచి అడిగాను.

"అదేమిటమ్మా, వాడు ఆ ఉడ్ రోజ్ తీగని అలా పీకి పోగులెడు తున్నాడు, వచ్చి చూడు"అన్నాను.

"నా మాట వింటారేమిటి? ఆయనిష్టం- తీగ పీకుతారు, ఇల్లు పీకుతారు, పీక్కోనివ్వండి'' అంది నిష్టూరంగా.

నా మనసు నిలవక, మళ్ళీ బాల్కనీలోకి వెళ్ళి చెప్పి చూశాను నిక్షేపంలా పువ్వులు పూస్తున్న తీగని పీకి పారెయ్యడం బాగుండదని. నామీద విసుక్కుని లేచాడు. నోరు మూసుకుని ఇవతలికి వచ్చేశాను.

చిన్నప్పుడు వాడికి నేనంటే ఎంత ఆపేక్ష వుండేది! వాళ్ల నాన్న గారు నన్ను చిన్న మాటన్నా సహించలేక పోయేవాడు. పొయ్యిలో కట్టెలు మండక, వంటింట్లో పొగతో నేను సతమతమవుతూంటే, "అమ్మా, నేను పెద్దయ్యాక నీకు ఈ వంట బాధ లేకుండా చేస్తానమ్మా'' అనే వాడు. కళ్ళలోనీళ్లు తిరిగేని వాడి మాటలికి.

వాడు పెద్దయాడు. నాకు వంట తప్పింది. నన్ను వంటింట్లో అడుగు పెట్టనివ్వదు కోడలు. అలా అని మురిసి పోనా! వాడు అమెరికాలో మూడేళ్లు వుండి వచ్చినప్పటి నుంచీ కారాలు తినలేకపోతున్నాడు. నా వంటలో కారం బాగా పడుతుంది మరి. అలవాటయిన చెయ్యి— ఎంత తగ్గించు కుందా మన్నా చాతకావడం లేదు. మా కోడల్లా చప్పిడి వంటలు చెయ్యడం నా కాదు. కారాలూ, పులుపులూ ఒంటికి మంచివి కావని ఉపన్యాసాలిస్తారు ఇద్దరూ కలిసి. నా కొచ్చిన పిండి వంటలు కూడా ఇప్పుడు పాత కాలపు వయిపోయాయి. ఆ బిరియానీలూ, కేకులూ నాకు రావు. కంది పచ్చడి కూడా మిక్సీలో నాయె! ఆ రుబ్బు రోలూ నాలాగే మూల పడింది.

పెద్ద వాళ్ళను బట్టే పిల్లలూనూ. మనవడికీ మనవరాలికీ నాతో కబుర్లేం వస్తాయి? అవేవో కామిక్కులుట — అని పుచ్చుకుని కూర్చుంటారిద్దరూ. ఇద్దరికీ భూతద్దాల్లాంటి కళ్లజోళ్ళు అప్పుడే.

రాత్రి వాళ్ల భోజనాలు చేస్తూండగా వాళ్ళ భోజనాల బల్ల దగ్గర నించుని అడిగాను "అబ్బాయ్, గోపాలం , ఎందుకురా ఆ తీగని అలా పీకేశావ్?'' అని.

"ఏ తీగ?'' అన్నాడు. వాడప్పుడే మరిచి పోయాడు! నా మనసులో ఇంకా అదే పీకుతోంది.

"అదేరా, ఆ వుడ్ రోజ తీగని'' అన్నాను.

"ఓ, అదా! అదో న్యూసెన్స్ అయిపోయింది. వరండా గ్రిల్లంతా చుట్టుకుని హాల్లోకి వెలుతురు రాకుండా చేస్తోంది. మేడ మీద గది కిటికీ అంతా అల్లుకు పోయింది. డాబా అంతా అల్లుకు పోయేట్టుగా వుంది. ఇక ఇల్లంతా ఆక్రమించేలా వుందని పీకి అవతల పారేశాను'' అన్నాడు నిర్లక్ష్యంగా.

"తీగనిండా బోలెడు పువ్వులున్నాయిరా నచ్చగా'' అన్నాను ప్రాణం వుసూరుమనిపించి.

"పువ్వులనూ టెలా వున్నా, తీగకదిపితే చాలు, పుట్టెడు దోమలు!'' అన్నాడు ఆదోమ లన్నీ ఒక్కసారి కుట్టేసి నట్లు మొహం పెట్టి.

నాకింకేం మాట్లాడాలో తోచలేదు.

పోయి నా మంచం మీద పడుకున్నాను. నిద్ర రాదు. ఒకటే ఆలోచనలు. ఆ ఉడ్ రోజ్ తీగే నా మనసునిండా. ఎందుకోదాన్ని తలుచు కుంటే పుట్టెడు జాలేస్తోంది. రేపు నా పరిస్థితీ అంతే అవుతుందా అనిపించింది. ఆ ఊహకే నా వళ్ళు జలదరించింది.

మనిషికీ మనిషికీ మధ్య మమత ఆ తీగంత దట్టంగా పెరగ కూడదేమో. అలా పెరిగితే పిల్లలైతే పెకిలించి పారెయ్యగలరు. తల్లికి అల్లుకు పోవడమే తెలుసు. ●

